సాక్షి తిరుపతి
గురువారం । 17 । ఏప్రిల్ । 2025



టోల్‌గేట్‌లో ఆకస్మిక తనిఖీలు

అలిపిరి టోల్‌గేట్‌లో జిల్లా ఎస్పీ, టీటీడీ ఇన్‌చార్జ్ సీవీఎస్వో హర్షవర్ధన్‌రాజు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. - 8లో



న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తాం

పోలీసుల దాడి బాధితులకు అండగా నిలిచి, న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తామని తిరుపతి ఎంపీ గురుమూర్తి తెలిపారు. - 8లో



రుయాలో అరుదైన శస్త్రచికిత్స

వెన్నెముక విరిగి బాధ పడుతున్న రోగికి తిరుపతి రుయా ఆస్పత్రిలో వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. - 8లో

న్యూస్‌రీల్

డిజిటల్ సేవలపై అవగాహన కల్పించండి



నాబార్డు రుణప్రణాళిక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, బ్యాంక్ అధికారులు

తిరుపతి అర్బన్: బ్యాంక్ డిజిటల్ సేవలపై అందరికీ అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం నాబార్డు రుణప్రణాళిక పోస్టర్‌ను కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్‌తో కలిసి బ్యాంక్ అధికారులు ఆవిష్కరించారు. రూ.18,032 కోట్లతో నాబార్డు రుణ ప్రణాళికలను శాఖల వారీగా కేటాయింపులను వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వు బ్యాంకు సూచనల మేరకు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు విస్తృతం చేసి, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డిజిటల్ లావాదేవీల్లో పిన్, పాస్‌వర్డ్, సీవీవీ విషయంలో గోప్యత పాటించాలని స్పష్టం చేశారు. బ్యాంకింగ్ యాప్‌లు, మొబైల్, ఇంటర్నెట్ బ్యాంక్, డిజిటల్ సేవలపై అన్నీ బ్యాంకుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. నాబార్డు జిల్లా మేనేజర్ సునీల్, ఎల్డీఎం విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జడ్జిల బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని పలు కోర్టుల్లో పనిచేస్తున్న న్యాయమూర్తులను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్‌పిడి.వెన్నెలను గుంటూరు జిల్లా రేపల్లెకు, ఈమె స్థానంలో పీలేరులో పనిచేస్తున్న కె.రవిను చిత్తూరుకు బదిలీ చేశారు. మదనపల్లె ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న డి.వెంకటేశ్వర్లును అనంతపురం జిల్లా హిందూపురానికి , ఈయన స్థానంలో కృష్ణా జిల్లా గన్నవరంలో పనిచేస్తున్న కె.జయలక్ష్మిను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

డ్రోన్లను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డీఏఓ ప్రసాద్‌రావు


తిరుపతి అర్బన్: రైతులకు అందిస్తున్న డ్రోన్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్‌రావు వెల్లడించారు. బుధవారం తిరుపతి రూరల్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో డ్రోన్లకు చెందిన కిసాన్ డ్రోన్ ఫామ్ మిషనరి బ్యాంక్ గ్రూపుల కన్వీనర్, కో కన్వీనర్లకు వాడకంపై అవగాహన కల్పించారు. జిల్లాకు 36 డ్రోన్‌లు మంజూరైన నేపథ్యంలో వాటిని త్వరలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఒక్కో డ్రోన్ రూ.10 లక్షలు విలువ చేస్తోందని వెల్లడించారు. అందులో 80 శాతం రాయితీ ఉంటుందని స్పష్టం చేశారు. ఓ క్రమపద్ధతిలో డ్రోన్లు వాడుకుంటే రైతులకు ఇబ్బందులు ఉండవని చెప్పారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథరెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఆర్ఏఆర్ఎస్ సుమతి, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి విక్రమ కుమార్‌రెడ్డి, ఎస్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి రాజ్‌సోము తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు సరే.. పైసలేవీ?

ఆరుగాలం చమటోడ్చి పంట పండించిన అన్నదాతలను ధాన్యలక్ష్మి కరుణించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మద్దతు ధరకు విక్రయించి, అప్పులు తీర్చుకుందామని ఈ కేంద్రాలకు వస్తున్న కర్షకులకు నిరాశే ఎదురవుతోంది. తరుగులు పేరుతో దోపిడీ ఒక ఎత్తైతే.. నగదు రావడం గగనంగా మారింది. ఇదే అదునుగా ధాన్యపు రాశులపై దళారులు వాలేస్తున్నారు. ధాన్యం కళ్లాలను దాటనీయకుండా సన్న, చిన్నకారుల రైతులను దోచేస్తున్నారు.



లారీలో లోడ్ చేస్తున్న ధాన్యం (ఫైల్)



కొనుగోలు కేంద్రాలున్నా ప్రయోజనమేదన్నా..

- నామమాత్రంగా ధాన్యం కొనుగోలు
- రైతులకు ఇంకా అందని నగదు
- దళారులు, మిల్లర్లకు ప్రయోజనం చేకూర్చిన కూటమి ప్రభుత్వం
- ఇబ్బందుల్లో అన్నదాతలు

సూళ్లూరుపేట: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగా మారాయి. కర్షకులు పండించిన ధాన్యం కొండంత కాగా ఈ కేంద్రాల్లో కొనుగోలు చేసింది గోరంత మాత్రమే. గత ఏడాది కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి, రైతులకు ఈ ప్రభుత్వం ఇప్పటివరకు నగదు ఇవ్వకపోగా ఈ ఏడాది జనవరి చివరి వారం నుంచి వరి కోతల సీజన్ ప్రారంభమైనప్పటికీ మార్చి మొదటి వారం వరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేసిన దాఖలాల్లేవు. దీంతో మిల్లర్లు దళారులను రైతుల వద్దకు పంపి, తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

అందని ధాన్యం నగదు?

పలువురు రైతులకు ఇంకా గత ఏడాది విక్రయించిన ధాన్యానికి సంబంధించి నగదు అందలేదు. తిరుపతి జిల్లాలోని 34 మండలాల్లో 16 మార్కెటింగ్ కమిటీల పరిధిలో 213 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని 774 పంచాయతీల్లో ఈ ఏడాది జిల్లాలో 2.07 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఎకరానికి సరాసరిన 30 బస్తాల దిగుబడిని వచ్చినా 4.90 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. అయితే మండలానికి రెండు వేల నుంచి 2,500 టన్నుల ధాన్యం మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేశారు. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా 34 మండలాల్లోని 7,384 మంది రైతుల నుంచి 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టుగా అధికారులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి రైతుల నుంచి రూ.152 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో 6,368 మంది రైతులకు రూ.120.52 కోట్లు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. మరో 634 మంది రైతులకు రూ.12.76 కోట్లు బిల్లులు ఇంకా ప్రాసెస్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇంకా 832 మంది రైతులకు రూ.18.72 కోట్లు ఇంకా పెండింగ్‌లో ఉంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి రైతులకు రావాల్సిన మొత్తం విడుదల వారీగా జమ చేస్తున్నారు. ఇందులో చాలామంది రైతులకు బ్యాంకుల్లో జీరో ఖాతాలు అయినందున వాటి పరిమితి రూ.2 లక్షల వరకే ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ధాన్యం విక్రయించిన రైతులు బ్యాంక్ ఖాతాలు తెరవడంలో ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని వివరాలు సక్రమంగా ఉంటే నగదు జమ అవుతోందని, బ్యాంక్ ఖాతాల్లో ఏవైనా సాంకేతిక పరమైన సమస్యలున్న వారికి ఇంకా డబ్బులు పడలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



కళ్లాల్లోనే ఆరబెట్టిన ధాన్యం(ఫైల్)

కళ్లాల్లోనే విక్రయం

రైతులు ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబెట్టుకుని స్టాక్ చేసే ప్రయత్నాలు చేసినప్పటికీ, ధరలు తగ్గిపోతాయన్న భయంతో ఎంతోకొంత నష్టపోయినా పరవాలేదని కళ్లాల్లోనే ధాన్యం విక్రయిస్తూ, నష్టాలను మూటగట్టుకుంటున్నారు. యంటీయూ-1010, ఎస్ఎల్ఆర్-145, ఆర్ఎస్ఆర్ఎం-7, ఎస్ఎల్ఆర్ 34449, బీపీటీ-5240, ఎస్ఎల్ఆర్-33358, ఎస్ఎల్ఆర్ 33057 రకాల ధాన్యం గ్రేడ్-ఏ రకంగా గుర్తించి క్వింటాల్ రూ.2,320 మద్దతు ధరను అధికారులు ప్రకటించారు. అలాగే యంటీయూ-1001, సీఆర్-1009, ఎస్ఎల్ఆర్-34242, ఏడీటీ-37, ఎస్ఎల్ఆర్-286000 రకాలను సాధారణ రకంగా గుర్తించి క్వింటాల్ రూ.2,300 మద్దతు ధర ప్రకటించారు. నెమ్ము కింద ఒక కిలో, గోనెసంచె కింద మరో కిలో, తరుగుల కింద మరో రెండు కిలోలు తీసేసి, బస్తాకి 79 కేజీలు ధాన్యం తీసుకుంటామని కొనుగోలు కేంద్రాల్లో చెప్పడంతో అదేదో మిల్లర్లకే ఇచ్చేస్తే అక్కడికక్కడే డబ్బులు ఇస్తారనే ఉద్దేశంతో సన్న, చిన్నకారు రైతులు కళ్లాల్లోనే ధాన్యం అమ్మేశారు. పెద్ద రైతులు సొంత గోదాములు తమ ధాన్యం నిల్వ చేసుకున్నారు. మరికొంతమంది రైతులు ఏఎంసీ గోదాముల్లో అద్దె చెల్లించి ధాన్యాన్ని నిల్వ చేసుకున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 34,300 మెట్రిక్ టన్నులు ధాన్యం గోదామ్‌ల్లో పూర్తిస్థాయిలో నిల్వ చేసుకున్నారు.

గిట్టుబాటు ధర లేదు



రైతులను అదుకుంటామని చెప్పి నడ్డి విరిచేస్తున్నారు. ధాన్యం అమ్ముకుందామంటే దళారులు, మిల్లర్లు మోసం చేస్తారు.. ధాన్యం కోనుగోలు కేంద్రాల పేరుతో ప్రభుత్వం మోసం చేస్తోంది. రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు రైతులకు పెట్టుబడి సాయం కింద నగదు జమ చేశారు. ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా పెట్టుబడి సాయం ఇవ్వకపోగా అరుగాలం పండించిన ధాన్యానికి కూడా ధరలు లేకుండా చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారు.
– మందా దేవేంద్రరెడ్డి, సుగ్గుపల్లి

చేతికందేదీ సున్నా



ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్ రూ. 2320, బీ గ్రేడ్ ధాన్యం రూ. 2300 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించింది. ఏ గ్రేడ్ ధాన్యం బస్తాకు 79 నుంచి 82 కిలోలు వరకు తడి, చెత్తా చెదారం పేరుతో లాక్కుంటున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకుంటే డబ్బులు ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి. బ్యాంక్ ఖాతాల్లో ఆధార్ లింక్ లాంటి సాంకేతిక పరమైన కారణాలతో కాలయాపన చేస్తున్నారు. పెట్టుబడి కోసం చేసిన అప్పులకు వడ్డీ పెరిగిపోతోంది. అక్కడ ఇచ్చిన గిట్టుబాటు ధర ఇక్కడ వడ్డీలకు సరిపోతుంది. చేతికి అందేది మాత్రం సున్నానే.
– సీ సుధాకర్, సీపీఐ నాయకులు, తడకంద్రిగ

90 శాతం మందికి పేమెంట్ చేశాం



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి ఇప్పటికే 90 శాతం పేమెంట్లు ఇచ్చేశాం. మరో వారం పదిరోజుల్లోనే మిగిలిన 10 శాతం పేమెంట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తాం. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పేమెంట్లు ఇచ్చాం. – సుమతి, జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్, తిరుపతి

ఇదేం నాటకం నానీ గారు..!

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు రమ్మంటారు.. మీరేమో అడ్డుకుంటారు
- తప్పు జరిగిందనా..? జరిగిన తప్పును కప్పిపుచ్చడానికా..?
- అసలు తిరుపతి గోశాల వద్ద రేపు ఏం జరగబోతోంది..?

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఓ పక్క టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఏమో గోశాల సందర్శనకు రండి అంటూ భూమన కరుణాకరరెడ్డికి ఛాలెంజ్ విసిరారు.. ఆ ఛాలెంజ్‌ను స్వీకరించిన భూమన రేపు వారు కోరిన విధంగా ఉదయం 10 గంటలకు తిరుపతి గోశాల వద్దకు వస్తానని అంగీకరించారు. అంతలోనే ఏం జరిగిందో ఏమో.. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గోశాల వద్ద నిరసన చేపట్టడానికి పిలుపునిచ్చారు. సోషల్ మీడియా ద్వారా చంద్రగిరి నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలందరూ పెద్ద ఎత్తున ఉదయం 9 గంటలకు గోశాల వద్దకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఇదేం నాటకం నానీ గారు.. మీ అధ్యక్షుడు రమ్మంటారు..? మీరేమో అడ్డంకులు సృష్టిస్తారు..? ఇంకో పక్క తిరుపతి నియోజకవర్గం నుంచి జనసేన పార్టీకి చెందిన ఎమ్మెల్యే తన అనుచరులతో వైఎస్సార్ సీపీ నాయకులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం ఉదయం 8 గంటలకు తమ కార్యకర్తలను గోశాల వద్ద మోహరింపజేసి అక్కడ అడ్డుకుని రసాభాస చేయాలని పక్కా ప్లాన్ కూడా వేసుకున్నట్టు తెలుస్తోంది. నిజం మీ వైపు ఉంటే భయమెందుకు..? ఇన్ని కుట్రలు ఎందుకు..? కూటమి నాయకులారా చెప్పండి..? కూటమి పార్టీల కుటిల రాజకీయం చూస్తున్న ఎవరికైనా నిజం ఎవరివైపు ఉందో అర్థమైపోతుంది. మీలో నిజాయితీ ఉంటే నిజాన్ని నిర్భయంగా భూమన కరుణాకరరెడ్డితో చర్చించడానికి ఎందుకు జంకుతున్నారు? ఎందుకు గురువారం రసాబాసా చేయాలని మీ కార్యకర్తలను పోగేస్తున్నారు..? ప్రజలకు బహిరంగంగా సమాధానం చెప్పాలి. ఇదంతా పక్కన పెడితే అసలు గోశాలలో రేపు ఏం జరగబోతుందోనన్న భయం పోలీసులను వెంటాడుతోంది.

గంగ జాతర వేడుకగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: తాతయ్యగుంట గంగమ్మ జాతరను వేడుకగా నిర్వహిద్దామని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం తిరుపతి కమిషనర్ నారపురెడ్డి మౌర్య, స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో కలసి అధికారులతో సమావేశం అయ్యారు. మాట్లాడుతూ తిరుపతి గంగమ్మజాతర రాష్ట్ర పండుగ అయిన నేపథ్యంలో ఘనంగా నిర్వహించడానికి అధికారులు అంతా సమష్టిగా ఓ ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మే 6 నుంచి 14వ తేదీ వరకు జాతర జరుగుతుందని చెప్పారు. భకులు పెద్ద ఎత్తున రానున్న నేపథ్యంలో తాగునీటి వసతి, క్యూలైన్ నియంత్రణ, కంట్రోల్ రూం ఏర్పాటు, పార్కింగ్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు, అంబులెన్స్‌లు, విద్యుత్తు సరఫరా, ఫైర్ సేఫ్టీ తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ ఇప్పటి నుంచే పారిశుద్ధ్య చర్యలపై ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలన్నారు. అడిషనల్ ఎస్పీ లా అండ్ ఆర్డర్ రవిమనోహరాచారి, ఆర్డీఓ రామమోహన్,గంగమ్మ ఆలయ ఈఓ జయకుమార్, జిల్లా దేవాదాయశాఖ అధికారి వెంకటకృష్ణారెడ్డి, అగ్నిమాపక అధికారి రమణయ్య, సెట్విన్ సీఈఓ వెూహన్‌కుమార్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ

ప్రభుత్వ భూములైనప్పటికీ జీఓ నంబర్ 30 ప్రకారం పేదల ఆధీనంలో ఉన్న ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ నిబంధనల మేరకే చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన జేసీ శుభం బన్సల్‌తో కలసి ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో మాట్లాడారు. జీఓ నంబర్ 30 నిబంధనలు అమలు చేయాలని తహసీల్దార్లకు ఇ ప్పటికే స్పష్టమైన ఆదేశాలిచ్చామని చెప్పారు. 2019 అక్టోబర్ 15వ తేదీకి ముందు తమ అధీనంలో ఉన్న ఇళ్ల స్థలాలను పేదలకు అందించడానికి నామమాత్రపు ధరలు కట్టించుకుని, వారికి శాశ్వతంగా అప్పగిస్తామన్నారు. ఆమేరకు వారు ఆ స్థలాలను రిజిస్ట్రేషన్లు సైతం చేయించుకోవచ్చని చెప్పారు. రిజిస్ట్రేషన్ల చేయించుకున్న రెండేళ్ల తర్వాత ఆ స్థలాలు విక్రయించుకునే హక్కు వారికి వస్తుందన్నారు.

ప్రకృతిని మనం కాపాడుకుంటే.. అది మనల్ని రక్షిస్తుంది. మన స్వార్థం కోసం విధ్వంసం చేస్తే అది పెను విధ్వంసం సృష్టిస్తుంది. కొందరు స్వార్థపరులు అత్యాశతో కూర్చున్న కొమ్మనే నరికేస్తున్నారు. మన జీవనాధారమైన నదులనే సర్వనాశనం చేస్తున్నారు. కేవలం ఇసుకాసురుల స్వలాభం కోసం లక్షలాది మంది ఉసురు తీస్తున్నారు. స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలతో ఏర్పడిన అగాధాలే ఇందుకు నిలువెత్తు నిదర్శనం. అయినా యంత్రాంగంలో కదలిక లేదు. అక్రమార్కులకు అడ్డుకట్ట పడలేదు.



తుమ్మూరు వద్ద స్వర్ణముఖి నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

స్వర్ణముఖిని తోడేస్తున్నారు!

నాయుడుపేటటౌన్: స్వర్ణముఖి నదిలో ఇసుకను అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తోడేస్తున్నారు. నాయుడుపేట పట్టణంలోని తుమ్మూరు సమీపంలో స్వర్ణముఖి నది వద్ద రెండు రైల్వే బ్రిడ్జిల సమీపంలో పగలు రాత్రి తేడా లేకుండ ఇసుక అక్రమ తరలిస్తున్నారు. దీంతో స్వర్ణముఖి నదిపై ఉన్న బ్రిటీష్ కాలం నాటి బ్రిడ్జిలు కూలిపోయే ప్రమాదకరంగా పరిస్థితి నెలకొంటోంది. ఈ విషయమై పలుసార్లు సంబంధింత శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైల్వే అధికారులే స్వయంగా చెబుతున్నారు. మండలంలోని భీమవరం, చిగురుపాడు, అయ్యప్పరెడ్డిపాళెం, కల్లిపేడు, మూర్తిరెడ్డి పాళెం, మర్లపల్లి, తదితర ప్రాంతాల్లో స్వర్ణముఖి నది నుంచి ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది.

ఇసుకాసురుల ధన దాహానికి గిరిజనుడి బలి

రాత్రి సమయంలో ఇసుకను తరలించే ట్రాక్టర్ వేగానికి అడ్డూ అదుపు లేకుండా ఉంది. ఈ క్రమంలోనే స్వర్ణముఖి నది నుంచి రాత్రి వేళ అక్రమంగా ఇసుకను తరలిస్తు ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొనడంతో పేద గిరిజనుడు బలయ్యాడు. తుమ్మూరు వద్ద బైక్‌ను ఇసుక ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొన్న ప్రమాదంలో అయ్యప్పరెడ్డిపాళెం మిక్సిడ్ కాలనీకి చెందిన ఈగ పులయ్య(26) మృతి చెందిన విషయం తెలిసిందే. ఇసుక ట్రాక్టర్ల వేగం కారణంగా పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.



ఇసుక తవ్వకాలతో గుంతలు, రాళ్లమయంగా మారిన స్వర్ణముఖి నది ఏరియాల్ వ్యూ

ఇసుక తవ్వకాలతో ప్రమాదకర పరిస్థితులు



స్వర్ణముఖి నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. తుమ్మూరుతోపాటు పలు చోట్ల నదిలో భారీ ఇసుక ఆగాదాలు ఉన్నాయి. వాటిలో ఆడుకునేందుకు పిల్లలు వెళ్లి, ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల నదిలో ఈతకు వెళ్లిన ఓ యువకుడు మృతి చెందాడు. రెండు రోజులు కిందట తుమ్మూరు వద్ద రాత్రి సమయంలో ఇసుక అక్రమంగా తరలించే ట్రాక్టర్ ఢీకొనడంతో నిరుపేద గిరిజనుడు మృతి చెందడం బాధాకరం. అధికారులు ఇసుక అక్రమార్కుల నుంచి బాధిత కుటుంబానికి నష్ట పరిహారం అందించాలి. – శివకవి ముకుందా, సీపీఎం నాయకులు ,నాయుడుపేట

ఇసుక అక్రమ రవాణా కట్టడికి చర్యలు



స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ రవాణాను కట్టడికి చర్యలు చేపడుతాం. ఇప్పటికే పలు సార్లు మండలంలోని పలు చోట్ల స్వర్ణముఖి నదిలో వాహనాలు వెళ్లకుండా అడ్డుగా గోతులను తవ్వేశాం. అయినప్పటికీ మళ్లీ ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసింది. ఆర్ఐతోపాటు వీఆర్వోల పంపి, ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేస్తాం.
–మాగర్ల రాజేంద్ర, తహసీల్దారు, నాయుడుపేట

ఇస్రో ఆధ్వర్యంలో ఆర్ఎల్‌వీ అభివృద్ధి



ఇస్రో అభివృద్ధి చేస్తున్న ఆర్ఎల్‌వీ-ఎల్ఈఎక్స్-3

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆర్బిటల్ రీ-ఎంట్రీ ఎక్స్‌పరిమెంట్ డిప్లాయిబుల్ లాండింగ్ గేర్(ఆర్ఎల్‌వీ)ను అభివృద్ధి చేస్తోంది. ఇస్రో చైర్మన్ డాక్టర్ వీ నారాయణన్, విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్, షార్ డైరెక్టర్ ఏ రాజరాజన్, ఐఐఎస్‌యూ డైరెక్టర్ పద్మకుమార్ సమక్షంలోని ల్యాండింగ్ గేర్ డ్రాప్ టెస్ సౌకర్యాన్ని ప్రారంభించారు. విమానం తరహాలో రెక్కలు కలిగిన పునర్వినియోగ లాంచింగ్ వెహికల్ పుష్పక్ కోసం డిప్లాయిబుల్ ల్యాండింగ్ గేర్ సిస్టం పరీక్ష అర్హత కోసం తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ)లో అత్యాధునిక ల్యాండింగ్ గేర్ డ్రాప్ట్ టెస్ట్ ఫెసిలిటీని ప్రారంభించారు. అయితే పుష్పక్ వాహనం ఆరోహణ క్రమంలో కక్ష్యలోకి ప్రవేశిస్తుంది. కొన్ని కక్ష్యల తరువాత పుష్పక్ వాతావరణంలోకి ప్రవేశించి డిప్లాయిబుల్ ల్యాండింగ్ గేర్ సిస్టంను ఉపయోగించి రన్‌వేపై ల్యాండ్ అవుతుంది. ల్యాండింగ్ గేర్ డ్రాప్ సౌకర్యానికి టెలిస్కాపిక్, ఆర్టిక్యులేటెడ్, సెమీ ఆర్టిక్యులేటెడ్ వంటి వివిధ రకాల ల్యాండింగ్ గేర్‌లను పరీక్షించే సామర్థ్యాన్ని కలిగి వుంటుంది. తారు, కాంక్రీట్, పొడి, తడి, మంచుతో నిండిన ఉపరితలాల వంటి విభిన్న రన్‌వేలపై ల్యాండింగ్ చేయగలిగిన సామర్థ్యం కలిగి ఉండేలా దీన్ని రూపొందిస్తున్నారు. అయితే భవిష్యత్తులో చంద్రుడిపై వ్యోమగాములను పంపి, తిరిగి తీసుకొచ్చే ప్రక్రియలో భాగంగానే ఈ ప్రయోగాత్మక పరీక్షలను చేస్తున్నామని కూడా ఇస్రో తెలియజేసింది. అధునాతనమైన ఆర్ఎల్‌వీలు, విమాన సాంకేతికతల అభివృద్ధి అర్హతను వేగవంతం చేసే సామర్థ్యాన్ని ఇస్రో కలిగి వుంది.

ఎన్ఎస్‌యూలో యూజీసీ బృందం పర్యటన



వర్సిటీ అధికారులతో యూజీసీ బృందం

తిరుపతి సిటీ:జాతీయ సంస్కృత వర్సిటీలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ రాజభాషా సమితి బృందం బుధవారం విస్తృత పర్యటన చేపట్టింది. ఇందులో భాగంగా వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అధికారులతో బృందం సభ్యులు డాక్టర్ కిశోర్ కుమార్, వీకే సుదర్శన దేవి సమావేశమయ్యారు. వర్సిటీలో రాజభాషగా ఉన్న హిందీ భాషను కార్యాలయ ఆదేశాలలో ఎంత వరకు అమలు చేస్తున్నారనే విషయంపై ఆరా తీశారు. అనంతరం బృందం సభ్యులు మాట్లాడుతూ వర్సిటీలో రాజభాష హిందీ అమలు తీరు సంతృప్తి కరంగా ఉందన్నారు. రాజభాషా సమితి ద్వారా హిందీ భాష అమలులో భాగంగా విశ్వవిద్యాలయానికి రాజభాషా నాయక్ పురస్కారం లభించడం విశ్వవిద్యాలయ పనితీరుకు తార్కాణమని తెలిపారు. అకడమిక్ డీన్ రజనీ కాంత శుక్లా, పరీక్షల నియంత్రణాధికారి సాంబశివ మూర్తి, ప్రొఫెసర్ సీ రంగనాథన్, రాజభాష విభాగం అధ్యక్షుడు డాక్టర్ లతా మంగేష్, సభ్యులు చారుకేశ్, వేద ప్రకాష్, బాలాజీ, హరినారాయణ పాల్గొన్నారు.

అసలేం జరుగుతోంది?

- చిన్నపాండూరు పీహెచ్‌సీలో డీఐఓ విచారణ



చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విచారణ చేస్తున్న డీఐఓ శాంతకుమారి

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అసలేం జరుగుతోంది.. అక్కడ రాత్రిపూట వైద్యం ఆపాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది.. ఆ అధికారం ఎవరిచ్చారంటూ..రౌండ్ ది క్లాస్ 24 గంటలు స్థాయి కలిగిన పీహెచ్‌సీ లో రాత్రిపూట వైద్యసేవలు ఆపివేయడంపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ సీరియస్ అయింది. ఈ నెల 14వ తేదీన సాక్షి దినపత్రికలో 'ప్రాథమిక వైద్యం రాత్రి వేళ దూరం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్ స్పందించారు. తక్షణమే ఆస్పత్రి క్షేత్రస్థాయిలో అసలేం జరుగుతోందో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని డీఐఓ శాంతాకుమారిని ఆదేశించారు. ఆ మేరకు బుధవారం ఆమె చిన్న పాండూరు పీహెచ్‌సీకి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రధానంగా ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ లావణ్య, డీడీఓ ద్వైతను విచారించారు. అనంతరం ఆస్పత్రి ఓపీ విధులు నిర్వహించే స్టాఫ్ నర్సులు, ఫీల్డ్ స్టాఫ్ ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లను వేర్వేరుగా విచారించారు. వారి నుంచి ఆస్పత్రి లో వైద్యాధికారులు, సిబ్బంది మధ్య ఏమైనా ఇ బ్బందులు ఉన్నాయా? లేక ఇతర సమస్యలు, కారణాలు గురించి ఆరా తీశారు. అలాగే ఆ విషయాలపై రాతపూర్వకంగా సిబ్బంది నుంచి సమాచారాన్ని సేకరించారు. అనంతరం డీఐఓ శాంతకు మారి మాట్లాడుతూ 24 గంటలు స్థాయి కలిగిన చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎట్టి పరిస్థితుల్లో రాత్రిపూట వైద్యసేవలు ఆపేందుకు వీలు లేదని, అలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతమైతే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేద ప్రజలకు వైద్యం అందించే పీహెచ్‌సీల్లో అనధికారికంగా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తెలిపారు. ఎవరి పరిధిలో వారు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం లేకనే వారం రోజుల పాటు పీహెచ్‌సీలో వైద్యసేవలు ఆపి వేయడం సిబ్బంది తప్పిదమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తితే అవి ఉన్నతాధికారుల దృష్టికి తీ సుకువస్తే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో జపాన్ బృందం పర్యటన


మాట్లాడుతున్న జపాన్ కంపెనీ మెడిన్‌షా కార్పొరేషన్ ఎండీ వకూయి

కోట:విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో బుధవారం జపాన్‌కు చెందిన మెడిన్‌షా కార్పొరేషన్ కంపెనీ ప్రతినిధుల బృందం పర్యటించింది. ఎన్‌బీకేఆర్ ఐఎస్టీకి 2018 నుంచి మెడిన్‌షా కంపెనీతో నైపుణ్య బదలాయింపుపై ఒప్పందం ఉంది. ఈ క్రమంలో కంపెనీ ప్రతినిధులు విచ్చేశారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి వారికి సాదరంగా స్వాగతం పలికారు. ఎన్‌బీకేఆర్ ఐఎస్టీకి వారు అందిస్తున్న స్కిల్ ట్రాన్స్‌ఫర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ వకూయి మాట్లాడుతూ జపాన్ సాయంతో బుల్లెట్ ట్రెయిన్ అహ్మదాబాద్ టూ ఢిల్లీ ఏర్పాటు కానున్న క్రమంలో అందులో తమ కంపెనీ భాగస్వామ్యం కూడా ఉందన్నారు. రానున్న పది సంవత్సరాల్లో తమ కంపెనీ ద్వారా అనేక మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఈ ఏడాది మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషంధర్ పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో ఐఎస్‌ఓ బృందం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఐఎస్‌ఓ బృందం బుధవారం పర్యటించింది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ పర్యటనలో తొలిరోజు బుధవారం వర్సిటీలో పలు విభాగాలలో సుడిగాలి పర్యటన చేశారు. ప్రధానంగా వర్సిటీలో అధునాతన సౌకర్యాలు, నాణ్యతా ప్రమాణాలు, అకడమిక్ విద్య, సామాజిక సేవా కార్యక్రమాలపై ఆరా తీశారు. పలు విభాగాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను, విద్యాప్రమాణాలను, రికార్డులను పరిశీలించారు. గురువారం వర్సిటీ అధికారులతో సమావేశమై పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి ఐఎస్‌ఓ సర్టిఫికేషన్‌ను అందించే అవకాశం ఉంది.

గాలీవాన బీభత్సం


రోడ్డుకు అడ్డంగా కూలిన తాటిచెట్లు

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలో పలు గ్రామాల్లో బుధవారం గాలీవాన బీభత్సం సృష్టించింది. గాలీవానకు తెలుగురాయపురం నుంచి కోటితీర్థం గ్రామానికి వెళ్లే దారిలో తాటిచెట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. దీంతో ఈ మార్గంలో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి.

న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తాం

- తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి


తిరుపతిలో ఎంపీ గురుమూర్తిని కలసిన పోలి భీమవరానికి చెందిన సంధ్య, చిన్నమనాయుడు

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం పోలి భీమవరానికి చెందిన చిన్నమనాయుడు భార్య సంధ్య కుటుంబానికి అండగా నిలబడి, న్యాయం కోసం న్యాయస్థానం ఆశ్రయిస్తామని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి స్పష్టం చేశారు. పోలి భీమవరం గ్రామానికి చెందిన సంధ్య అనే మహిళ, ఆమె భర్త చిన్నమనాయుడితో శ్రీకాళహస్తి రూరల్ ఎస్‌ఐ నరసింహారావు అవమానకరంగా ప్రవర్తించి, దాడి చేసినా చర్యలు తీసుకోలేదు. ఈ ఘటనపై వారు బుధవారం తిరుపతిలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీని కలసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులమనే కక్షతో పోలీసులు తప్పుడు కేసు పెట్టి వేధిస్తున్నారని, ఈనెల 11వ తేదీన ఉదయం ఎస్‌ఐ నరసింహారావు నేరుగా ఇంటికి వచ్చి సంధ్యను జుట్టుపట్టుకుని ఈడ్చుకెళ్లి వారి ప్రత్యర్థులతో కొట్టించారని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎంపీ మాట్లాడుతూ ఇది అత్యంత దుర్మార్గపు చర్య అన్నారు. శాంతి,భద్రతలను కాపాడాల్సిన స్థాయిలో ఉన్న పోలీసులే గ్రామాల్లో వర్గ, వైషమ్యాలను రెచ్చగొట్టి, మహిళపై పరుష పదజాలంతో దూషిస్తూ, ఆమెపై దాడికి దిగడం దౌర్భాగ్యమన్నారు. ఇంత జరిగినా ఆయనపై పోలీసు ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవటం ఆశ్చర్యానికి గురి చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యం ఎటుబోతోందని ప్రశ్నించారు. న్యాయం జరగకపోతే వైఎస్సార్ సీపీ బాధిత కుటుంబానికి అండగా నిలిచి న్యాయపోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. బాధిత మహిళ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక, తమపై కక్ష కట్టి టీడీపీ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. తన భర్త వైఎస్సార్ సీపీ కార్యకర్త కావడంతోనే తమ కుటుంబంలో అందరిపైనా తప్పుడు కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇంటర్ చదివే తన కుమారుడిపైనా కేసు పెట్టి భవిష్యత్తును నాశనం చేశారని ఆమె ఎంపీ ముందు వాపోయింది. దీంతో ఆయన వారికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడు మండలం మూలకంద్రిగ సమీపంలో బుధవారం ఆటోసహా 9 బస్తాలు రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన రేషన్ బియ్యాన్ని ఆమందూరు గ్రామానికి చెందిన గొడుగు లక్ష్మి, కందెల చెంగమ్మ పాపానాయుడుపేట చుట్టుపక్కల గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు విక్రయించేందుకు ఆటోలో తరలిస్తుండగా, మూలకంద్రిగ సమీపంలో వాహనాలు తనిఖీల సందర్భంగా గుర్తించి, స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఆటోలో ఉన్న ముగ్గుర్ని అరెస్టు చేసి, 450 కిలోల బరువున్న 9 బియ్య బస్తాలను, ఆటో సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై గుర్తు తెలియని వ్యక్తి దాడి

చిల్లకూరు: గూడూరులోని మాళవ్యనగర్ ప్రాంతానికి చెందిన ఓ ఆటో డ్రైవర్‌పై బుధవారం నెల్లూరు జిల్లా వెంకటాచలం ప్రాంతంలో దాడి చేసి తీవ్ర గాయపరిచినట్లు బాధితుడు తెలిపారు. మాళవ్యనగర్ ప్రాంతానికి చెందిన జనార్దన్ అనే ఆటో డ్రైవర్ బాడుగకు నెల్లూరుకు వెళుతుండగా వెంకటాచలం ప్రాంతంలో జాతీయ రహదారిపై ఓ గుర్తు తెలియని వ్యక్తి కారులో వచ్చి ఆటోను ఆపి, దాడికి పాల్పడినట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో ఇద్దరు పోలీసులున్నప్పటికీ కనీసం వారు దాడి చేసిన వ్యక్తిని వారించిన పాపాన పోలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కూడా వీలు పడక పోవడంతో 100కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దాడి చేసిన వ్యక్తిని గుర్తించి అతనిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

తిరుపతిలో పాతకక్షలతో..

తిరుపతి క్రైం: ఆటో డ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన బుధవారం వేకువజామున చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ బాలకృష్ణ కథనం మేరకు.. న్యూఇంద్రనగర్‌లో నివాసముంటున్న మణికంఠ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో విభేదాలు ఉండేవి. ఇదే క్రమంలో పాతకక్షలు ముదిరిపోవడంతో మణికంఠను చంపేందుకు తరుణ్ అతని స్నేహితుడితో కలిసి ప్లాన్ చేశాడు. మణికంఠ ఇంటి సమీపంలోని వేకుజామున ఇరువురు కలిసి రాళ్లతో దాడి చేసే ప్రయత్నం చేశారు. మణికంఠ పరుగులు తీయడంతో స్వల్ప గాయాలతో ఆస్పత్రిలో చేరాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సూళ్లూరుపేటలో అమెరికన్ లేజర్ ఐ ఆస్పత్రి

సూళ్లూరుపేట: ప్రపంచస్థాయి వైద్యాన్ని అందించనున్న అమెరికన్ లేజర్ ఐ ఆస్పత్రిని ఈనెల 18న సూళ్లూరుపేట పట్టణంలోని ప్రారంభిస్తున్నామని సీపీఐ రాష్ట్ర నాయకుడు మోదుగుల పార్థసారథి తెలిపారు. కార్పొరేట్ వైద్యాన్ని అత్యంత సామాన్యమైన ఫీజులు ఈ ప్రాంత ప్రజలకు అందించేందుకు సూళ్లూరుపేట 23 బ్రాంచ్‌ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. లేజర్ శస్త్రచికిత్స, కంటి శుక్లం(కేటరాక్ట్) చికిత్స, గ్లకోమా చికిత్స, కార్నియా సంబంధిత చికిత్స, చిన్న పిల్లలకు కంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం తదితర అత్యాధునిక వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, మోదుగుల అరుణ, మోదుగుల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తెలుగు నవలల పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డుల ట్రస్టు ఆధ్వర్యంలో జాతీయ స్థాయి తెలుగు నవలల పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ ట్రస్టు వ్యవస్థాపకురాలు డాక్టర్ కె.రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకు ముద్రితమైన తెలుగు నవలలను మాత్రమే పోటీకి అర్హతగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన నవలా రచయితలు తమ నవలల మూడు ప్రతులను మే 5వ తేదీలోపు డాక్టర్ కె.రామలక్ష్మి, రామలక్ష్మి నర్సింగ్ హోమ్, 17-434 సుందరయ్య వీధి, చిత్తూరు, ఆంధ్రప్రదేశ్-517001 చిరునామాకు పంపాలని తెలిపారు. పోటీకి పంపిణీ నవలల్లో నాలుగు ఉత్తమ నవలలుగా ఎంపిక చేస్తామని తెలిపారు. జూన్ 12వ తేదీ చిత్తూరులో నిర్వహించే కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కార సభలో ఉత్తమ నవలకు రూ.10 వేలు నగదు, జ్ఞాపికతో ప్రముఖులచే సత్కారం అందించనున్నట్లు తెలిపారు.

రుయాలో అరుదైన శస్త్రచికిత్స

తిరుపతి తుడా: స్థానిక రుయాస్పత్రిలో వెన్నుముక ఫ్రాక్చర్‌తో బాధపడుతున్న జిల్లా వాసి ప్రేమానంద్(74) అనే వ్యక్తికి ఆస్పత్రి వైద్య బృందం అరుదైన శస్త్ర చికిత్స చేసింది. శరీరంపై కోతలు, కుట్లు లేకుండా అధునాతన పద్ధతిలో పర్క్యుటేనియస్ వర్టిబ్రోప్లాస్టి సర్జరీ విజయవంతంగా పూర్తి చేశారు. శస్త్ర చికిత్స చేసిన వారిలో న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, డాక్టర్ అనంత కిరణ్, డాక్టర్ సుదర్శన్ అగర్వాల్, డాక్టర్ రాధ, డాక్టర్ శివశంకర్ ఉన్నారు. వైద్య బృందాన్ని రుయా ఇన్‌చార్జ్ సూపరింటిండెంట్ డాక్టర్ మధుసూదన్, డీసీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, ఏఆర్‌ఎంఓ డాక్టర్ హరికృష్ణ అభినందించారు.

గ్రామ సమాఖ్య పటిష్టతోనే మహిళాభివృద్ధి

తిరుపతి రూరల్: గ్రామ సమాఖ్య పటిష్టతోనే మహిళాభివృద్ధి సాధించవచ్చని, ప్రతి కుటుంబంలో ఒక మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదగాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టీఎన్ శోభన్‌బాబు ఆకాంక్షించారు. బుధవారం తిరుపతి రూరల్ మండలంలోని వెలుగు మండల మహిళా సమాఖ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ఎన్నో పథకాలు అమలు చేశాయని, వాటిపై వార్షిక క్రెడిట్, జీవనోపాధి ప్రణాళిక సర్వే చేస్తున్నట్లు తెలిపారు. పీఎం ఎఫ్‌ఎంఈ, పీఎం ఈజీపీ, ముద్ర, పీఎం విశ్వకర్మ తదితర పథకాలను మహిళలు అందిపుచ్చుకుని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని కోరారు. సంఘం సమావేశాలకు వంద శాతం హాజరై సమావేశంలో డిజిటల్ లావాదేవీలు నిర్వహించి, పుస్తక నిర్వహణ అప్‌డేట్‌గా ఉంచుకోవడం చేత సంఘాల్లో అవకతవకలు జరగకుండా అరికట్టవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏరియా కో ఆర్డినేటర్ వనజాక్షి, ఏపీఎం నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,543 మంది స్వామివారిని దర్శించుకోగా 21,346 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.22 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించబోరని స్పష్టం చేసింది.

అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయండి


అక్రమ మైనింగ్‌పై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు: గూడూరు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ అడ్డు అదుపు లేకుండా కొనసాగుతుందని, దీనికి అడ్డుకట్ట వేయాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీననను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ కోరారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సబ్ కలెక్టర్‌ను ఆయన కలిశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఐదు రోజుల కిందట గూడూరు మండలం చెన్నూరు రెవెన్యూ పరిధిలోని తుంగపాళెం సమీపంలో ఉన్న శ్రీనివాసమైనింగ్‌లో తెల్లరాయి అక్రమంగా తవ్వి, తరలిస్తున్నా రని తెలిసి, అక్కడ మైన్‌ను పరిశీలించేందుకు బయలుదేరామన్నారు. దీనికి అనుమతులు లేవని పోలీసులు అడ్డుకుని గృహ నిర్బంధం చేశారని తెలిపారు. శ్రీనివాసమైన్‌లో అక్రమ మైనింగ్ కొనసాగుతుందనడానికి పలు నిదర్శనాలున్నాయని, దీనిపై గనుల శాఖ మ్మిన్నకుండి పోవడంతోనే ప్రభుత్వ ఆదాయానికి గండి పడి అక్రమమార్కుల జేబులు నిండుతున్నాయన్నారు. దీనికి అడ్డుకట్ట వేయాలని కోరారు. రోజూ టన్నుల కొద్దీ తెల్లరాయి తరలించేస్తున్నారని తెలిపారు. అక్రమ తవ్వకాలకు ఊతమిస్తూ రెవెన్యూ, పోలీస్, గనులశాఖాధికారులు చేష్టలుడిగి చూస్తున్నారని తెలిపారు. ఎప్పుడో మూత పడిన మైన్‌కు అనుమతులు ఎలా ఉన్నాయని గనులశాఖాధికారులను అడిగితే గతంలో మైన్‌లో నిలిచి పోయి ఉన్న మెటీరియల్‌ను తరలించుకునేందుకు వారికి అనుమతులు మంజూరు చేసినట్లు చెప్పారన్నారు. దీంతో సబ్‌కలెక్టర్ గనులశాఖ ఏడీ శ్రీనివాసరావుకు ఫోన్ చేసి మైన్‌కు సంబంధించిన అనమతి పత్రాల ను తనకు ఇవ్వాలని చెప్పడంతో గనులశాఖ ఏడీ నీళ్లనములుతూ ముక్తసరిగా సమాధానం ఇవ్వడంతో సబ్ కలెక్టర్ కూడా ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. వివరాలు తెలుసుకుని, చర్యలు చేపడతామన్నారు. చేవూరు విజయమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

510 సెల్‌ఫోన్లు స్వాధీనం


సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి క్రైం : చోరీకి గురైన రూ.1.12 కోట్లు విలువ చేసే 510 సెల్‌ఫోన్లు రికవరీ చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు వెల్లడించారు. బుధవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి జిల్లాలో పోగొట్టుకున్న వారి సెల్‌ఫోన్ల కోసం ప్రత్యేకంగా జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన 'మొబైల్ హంట్' (పోలీస్ వాట్సాప్ నంబర్ 9490617873) అప్లికేషన్‌కు వచ్చిన ఫిర్యాదులపై గతంలో రూ.7.56 కోట్ల విలువ చేసే 4,275 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. తాజాగా 13 విడతలో 510 సెల్‌ఫోన్లను సైబర్ క్రైమ్ పోలీసులు రికవరీ చేశారన్నారు. ప్రధానంగా శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటున్నారని, అలాగే కొన్ని చోరీకి గురవుతున్నాయని తెలిపారు. అలాంటి వారంతా 'మొబైల్ హంట్'కు హాయ్ అని మెసేజ్ చేస్తే లింకు వస్తుందని, అందులో వారి వివరాలను పూర్తి చేయాలన్నారు. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్)లో ఇది నమోదవుతుందన్నారు. సెల్‌ఫోన్‌లో సమాచారం దుర్వినియోగం కాకుండా ఆ ఫోన్ బ్లాక్ అవుతుందన్నారు. దాని ద్వారానే సెల్‌ఫోన్లను రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. రికవరీ చేసిన ఫోన్లన్నీ ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రం నుంచి తీసుకొచ్చామన్నారు. కేసును ఛేదించడంలో సైబర్ సీఐ వినోద్ కుమార్, సిబ్బంది ఎంతగానో కృషి చేశారన్నారు. అనంతరం సైబర్ సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి, అభినందించారు.

అలిపిరి టోల్‌గేట్‌లో ఆకస్మిక తనిఖీలు

తిరుపతి క్రైమ్: అలిపిరి టోల్‌గేట్‌లో జిల్లా ఎస్పీ, టీటీడీ ఇన్‌చార్జి సీవీఎస్వో హర్షవర్ధన్ రాజు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అలిపిరి టోల్‌గేట్‌లో స్కానర్ మానిటర్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రతి ఇమేజ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అనుమానం ఉన్న వస్తువులను సిబ్బంది వెంటనే ఫిజికల్‌గా తనిఖీ చేయాలన్నారు. వాహనాల తనిఖీలు చేస్తున్న సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీఎఫ్ సిబ్బంది, విజిలెన్స్ సిబ్బందిని ఆదేశించారు. వాహనాలు రద్దీగా ఉన్నాయని, వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దన్నారు. టోల్ గేట్ వద్ద తిరుమలకు వెళ్లే భక్తుల వాహనాలు ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలన్నారు. తిరుమలకు వెళుతున్న ద్విచక్ర వాహనాలు, కార్లలోని వస్తువులను సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అలిపిరి టోల్‌గేట్ వద్ద వీఐపీ వాహనాలు, సామాన్య ప్రజల కార్లు వెళ్లే మార్గంతో పాటు ద్విచక్ర వాహనాలు వెళ్లే మార్గాలను పరిశీంచి పలు సూచనలు చేశారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన


కలెక్టర్‌కు హోమ్‌స్టేల మూల్యాంకనం సమర్పిస్తున్న ప్రొఫెసర్లు

తిరుపతి అర్బన్: వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు విస్తృత్తంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్‌తో పాటు జేసీ శుభం బన్సల్, జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి జీవీ నారాయణరెడ్డి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పీవీ జగదీశ్‌తో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాట్సాప్ గవర్నెన్స్ వినిగించుకునేలా అవగహన కల్పించాలని తెలిపారు. ఈ నెల 15 నుంచి ప్రతి ఇంటికి మన మిత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపా రు. ప్రతి పౌరుడి ఫోనులో 9552300009 నంబరు సేవ్ చేయించాలని సూచించారు. మనమిత్ర పేరిట వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వం 210 సేవలు కల్పిసుందని, మరో వారంలో రోజుల్లో ఈ సంఖ్య 250కి పెంచుతున్నామని, పక్షం రోజుల్లో 350 సేవలు అందిస్తామన్నారు. రాబోయే రోజుల్లో దాదాపు వెయ్యి రకాల సేవలు అందించాలన్నదే ప్రభుత్వ ఆశయంగా పేర్కొన్నారు.

చట్టబద్ధమైన దత్తతను స్వాగతించండి

పిల్లల దత్తతకు సంబంధించి చట్టబద్ధతను స్వాగతించడం ద్వారా భవిష్యత్‌లోను సమస్యలు పునరావృతం కాకుండా ఉంటాయని కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంగళ, బుధవారాల్లో ఇద్దరు పిల్లల దత్తత అంశాన్ని గుర్తు చేశారు. పిల్లలు లేని తల్లిదండ్రులు cara.wcd.gov.ivలో నమోదు చేసుకోవడంతో పాటు మహిళా పోలీసు లు, అంగన్‌వాడీలు, బాలల సంరక్షణ సమితి ఆధ్వర్యంలో దత్తత తీసుకోవడం ద్వారా చట్టబద్ధత ఉంటుందన్నారు.

హోమ్‌స్టేల మూల్యాంకనం సమర్పణ

జిల్లాలోని హోమ్‌స్టేలపై వివరణాత్మక మూల్యాంకన నివేదికను కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సమర్పించారు. ఈ నివేదికను శ్రీవేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ తిరుపతి నుంచి ఎంబీఏ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎం.నీరజ, ప్రొఫెసర్ ఎస్.గౌతమి తయారు చేసి సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ప్రాంతీయ డైరెక్టర్ ఆర్.రమణప్రసాద్ వారితో ఉన్నారు. పర్యాటక విధానాన్ని మార్గనిర్దేశం చేయడం, సందర్శకుల అనుభవాన్ని మెరుగుపరచడం, హోమ్‌స్టేల ద్వారా స్థిరమైన, కమ్యూనిటీ ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహించడం ఈ నివేదిక లక్ష్యంగా కలెక్టర్‌కు వారు వివరించారు.

